# గాటీ

వనజమ్మ వడ్డిస్తోంది.

రాజారావు, ఇద్దరు పిల్లలూ భోజనం చేస్తున్నారు. వంటగది ద్వారం దగ్గర జిమ్మీతో బాటు గాటీ వుంది.

వడ్డిస్తున్న వనజమ్మ కళ్ళెర్ర జేసింది.

కళ్ళెర్ర జేస్తున్నది జిమ్మీ మీద కాదని, తన మీదేనని గాటీ గ్రహించి గతుక్కుమంది.

"తింటున్నప్పుడు ఎందుకలా చూస్తావ్ ఫో. పోయి వరండాలో తగలడు"

గాటీ వరండాలో తగలడ్డానికి వెళ్ళిపోయింది.

వనజమ్మ కసరగానే బిక్కచచ్చిపోయి, రంగులు మారిపోయిన ఆ పిల్ల లేత ముఖం చూసి రాజారావు బాధపడ్డాడు. భార్య ప్రవర్తన తనకేం నచ్చలేదు.

"మనం తింటుంటే గాటీ చూడగూడదా మమ్మీ"—అడిగింది అయిదేళ్ళ కూతురు బేబి.

"చూడగూడదు"

"చూస్తే"

"కడుపులు పొంగుతాయి" అంది వనజమ్మ.

గాటీ కళ్ళకి కడుపులు పొంగించేటంత పవరు వున్నందుకు బేబీ ఆశ్చర్యంతో ఇంతింత కళ్ళుచేసి "నిజవా డాడీ" అని తండ్రి నడిగింది.

"లేదమ్మా, కళ్ళతో చూస్తే కడుపులు పొంగవు. ఒక టయిము గియమూ లేకుండా, రెస్టులేకుండా ఆ చెత్తా ఈ చెత్తా లాగించేస్తేనే పొంగుతాయి కడుపులు. కావలిస్తే మీ అమ్మ కడుపు చూడండి"

అమ్మ కడుపు చూస్తూ పిల్లలిద్దరూ పకపక నవ్వారు. రాజారావు కూడా నవ్వాపుకోలేక పోయేడు.

వనజమ్మను రాజారావు పెళ్ళాడేటప్పటికి సన్నంగా, "అందంగా వుండేది. ఇప్పటికి పెళ్ళయి పదేళ్ళు ఈ పదేళ్లూ చీకూ, చింతా లేకుండా ఏది తినాలనిపిస్తే అది తిని, ఇద్దరు పిల్లల్ని కనడం తప్ప మరో పని లేక పోవడంతో బరువు పెరిగి, శరీరం సాగి పిప్పళ్ళ బస్తాగా మారిపోయింది.

కూర్చోడం చేత మరింత ముందుకు తన్నుకు వచ్చిన పొట్టను పయిటతో కప్పేసి–రాజారావు కేసి తీవ్రంగా చూసింది వనజమ్మ.

ఆ చూపు చూసి నవ్వుతున్న రాజారావు పొలమారేడు. గ్లాసుడు మంచినీళ్ళు తాగేడు.

"లేకపోతే ఏమిటి వనజా ! మన పిల్లలతో బాటు గాటికి అన్నం పెట్టేస్తే ఏం పోతుంది ? పని చేసి ఆకలితో వున్న పిల్లని అలా కసిరే సావు గదా ! ఆ పిల్ల ఎంత బాధ పడుతుందో ఆలోచించు"

"నోర్మూసుకోండి. మీరేం నాకు చెప్పక్కర్లే. ఎవర్ని ఏ స్థానంలో వుంచాలో నాకు బాగా తెల్సు"— సీరియస్‌గా అని, అంతలోనే ముఖంలో రంగు మార్చేసి, కళ్ళలో నీళ్ళకుండ బద్దలు గొట్టి—"ఆ పని గుంట తిండికోసం అడిగారు గాని—'వనజా తిన్నావా, తినకపోతే మాతోనే నీవూ వడ్డించేసుకోగూడదా' అన్నమాట ఇప్పుడేకాదు ఎప్పుడైనా అన్నారా ? నా కోసం పట్టించుకోడమే మానేశారు. ఏం, నేను పని పిల్లపాటి చేయక పోయానా....నన్ను చూస్తే మీకూ. పిల్లలకీ నవ్వులాటగా వుంది" అని ముక్కు చీది, చేయి గోడకి రాసేసింది. కళ్లు పమిట చెంగుతో వత్తేసు కుంటోంది.

ఈ హఠాత్పరిణామానికి రాజారావు మతిపోయింది !

* * *

వనజమ్మకి ఆఫీసరైన భర్త. అద్దిదేగాని పెద్ద ఇల్లు. ముచ్చటైన ఇద్దరు పిల్లలూ. ఒంటినిండా నగలూ, బోల్డు చీరెలూ వున్నాయి. లేనిది ఒక్కటే — తృప్తి.

రాజారావు కారు కొనే వరకూ రాజారావుని ఆఫీసర్‌గా ఆమె గుర్తించదల్చుకోలేదు. ఇల్లు ఇలాగా వుండాల్సింది ? పెద్ద బంగళా — పోర్టికోలో - అశోకవృక్షాలు, రకరకాల, రంగురంగుల పూల మొక్కలూ - తివాచీ పరిచినట్టున్న పచ్చగడ్డి — చుట్టూ అందమైన కాంపౌండ్ గోడ — గేటు దగ్గర గూర్ఖా — ఆ గేటుకే 'బి వేర్ ఆఫ్ డాగ్స్' అనే బోర్డు.... అప్పుడే అది తన ఇల్లని గర్వంగా చెప్పుకోగలదు. ఇంకా ఇంట్లో ఫ్రిజ్ అయినా లేదు. రెండు సోఫాలున్నాయి. ఏం చాల్తాయి ?

తన ఇలాంటి కోరికలు ఎన్ని వున్నా ఆర్థికంగా భర్తపై ఆధారపడక తప్పక పోవడం వల్ల, తన పుట్టింటివారు కలవాళ్ళే అయినప్పటికీ ఆ సిరులన్నీ ఆడపిల్లకివ్వని అన్నదమ్ములుండడం వల్ల ఆమెకు తన మీదే తనకి చిరాకు, కోపం.

కార్లూ, ఫ్రిజ్‌లూ, బంగళాల కేంగాని — చివరికి అగ్గిపెట్టెకి కూడా భర్త ముందు చేయి చాచాలి. అంచేత తను ఆశల శిఖరాలకి ఎక్కాలంటే భర్తనే ఆసరా చేసుకొని ఎక్కాలి. కాని భర్త అంది రాక పెద్ద తల నొప్పయి కూర్చున్నాడు.

వనజమ్మ తన కోరికల్ని నవ్వుతూ, ఏడుస్తూ, కులుకుతూ. కుమిలి పోతూ, అర్థిస్తూ. బుజ్జగిస్తూ, కోపగిస్తూ, అరుస్తూ. అనునయిస్తూ — ఏ విధంగా అడిగినా రాజారావు కాదనడు. అవుననడు. శ్రీ కృష్ణ పరమాత్మలా ఒక చిరునవ్వు మాత్రం చిలకరించి నిష్క్రమిస్తాడు. నెమ్మదిగా, వనజమ్మ కోరికల గుట్టల్ని ఆమె నెత్తి మీదే వుంచేసి జారుకుంటాడు మెల్లగా. వనజమ్మకి రాజారావు పై అందుకే కోపం. తనడిగింది అవునని కాకపోయినా. కాదనయినా అనొచ్చు గదా ! అయితే —

అవును, కాదు అనకుండా ఓ రోజు గాటీని తెచ్చేడు రాజారావు. అది వనజమ్మ కోరిక మాత్రం కాదు.

ఎంచేతంటే గాటీ కారు కాదు. మేడకాదు. ఫ్రిజ్‌కాదు. సోఫాకాదు కనీసం కుక్కకూడా కాదు.

ఓ దిక్కుమాలిన పిల్ల! ఓ దరిద్రపు ముండ!

తను అంతస్థు, ఆధిక్యత గురించి పోరితే -దెస్టను, దారిద్ర్యాన్ని తెచ్చాడు మొగుడు!

ఒళ్లుమండి, భుగభుగ అగ్ని పర్వతంలా విరుచుకు పడబోయి ఆగి పోయింది. ఆలోచించి ఆగిపోయింది. తనది స్థూలకాయం. ఇంట్లో అన్ని పనులూ తను చూసుకోలేక పోతోంది. లచ్చి పనికి సరిగా రాదు. అంట్లు తోమినా అవి తళతళ్లాడవు. దాని ముఖంలానే జిడ్డుగా, కళా విహీనంగా ఏడుస్తాయి. ఏమిటే ఇది -అనడిగితే 'అంతకన్నా నాను సేయలేను' అని పెడసరం జవాబు. అదీగాక ఆ పెడసరం ముండది పిట పిటలాడే వయసు. ఆ ముండ తన భర్తను చూసి కులుకుతోంది. దాని గుడిసెకెళ్లి నలుగురిలో నగుబాట్లు తెస్తాడేమోనని భయం కూడా ఉంది. అంచేత దాన్ని మానిపించేసి, ఈ గుంటపాపతో అన్ని పనులూ చేయించు కొని మిగిలిన ఎంగిలి ముద్ద ఇంత తగలేయవచ్చు. కోపమ్మ. చేయించి లచ్చికిచ్చినట్టు పాతిగ్గాదు, పైసాకూడా ఇవ్వనక్కర్లేదు - అనుకొని శివతాండవం చేయకుండా శాంతించింది.

ఆ మరుసటి రోజే వనజమ్మ ఒక కుక్కపిల్లని తెచ్చింది!

రాజారావు ఏమీ అనలేదు.

ఆమె కుక్కపిల్లను తెస్తూ రాజారావు మీదకి కత్తిలాంటి చూపు విసిరింది, రాజారావుకిగుచ్చుకోలేదు. ఆచూపుఅర్థంఏమిటంటే-నీవుతెచ్చిన పిల్ల దారిద్ర్యానికి సింబలు! నేను తెచ్చిన పిల్ల స్టాటస్‌కి సింబలు! అర్థ మయిందా, ఇప్పుడేమంటావు? రాజారావు ఏమీ అనలేదు. తనకి కూడా

కుక్కపిల్ల వచ్చింది. తెల్లగా, బొచ్చుగా, ముద్దుగా ఉంది. కాని – ఏదీ చూస్తానంటే. ఇప్పుడు పొసుక్కుంది వనజమ్మ. నవ్వేశాడు రాజారావు.

వనజమ్మ ఆ కుక్కపిల్లను సంపాదించడానికి చాలా శ్రమించింది. ఎంతో చెమట కార్చింది. పక్కవీధిలో నున్న బంగళాకి తన కాయాన్ని తోలై సాష్టి దొర్లించింది. ఆ బంగళాలో వున్న సుందరి మహిళామండలి అధ్యక్షురాలు! వనజమ్మ ఆ మండలి సభ్యురాలు! అధ్యక్షురాలు మండలికి వచ్చినప్పుడల్లా ఫారెన్ కారులోనూ, సీమకుక్కతోనూ వచ్చేది. ఆమెలా కారు కాకపోయినా కనీసం ఓ కుక్కపిల్లనైనా సొంతంగా – ఖర్చుపై ఆధారపడకుండా – సంపాదించాలనుకుంది.

బంగళా సుందరిని తను బంగళా, కారూ అడగలేదు. అవి అడిగే వస్తువులు కావు. కాని కుక్కను అడగొచ్చు. అడిగింది వనజమ్మ. అలా పందసార్లు అడిగించుకుంది బంగళా సుందరి. చివరికి తన దగ్గరున్న బోల్డు కుక్కల్లో – అక్కర్లేదనుకున్న ఓ కుక్క పిల్లను ఇచ్చింది. అదే మహాప్రసాదంలా అద్దుకుంది వనజమ్మ.

ఆ రోజు నుంచీ ఇంటి పనంతా పూర్తిగా గాటీకి వదిలేసి– తను కుక్క సంరక్షణతోనూ, కుక్కతో గొప్పగా ఇరుగు పొరుగు ఇళ్లకి తిరగడం తోనూ – తనో చిన్న బంగళా సుందరిలా ఫీలయి హాయిగా గడిపేస్తోంది.

ఆ కుక్కపిల్లకి 'జిమ్మీ' అని పేరు పెట్టుకుంది. జిమ్మీని పిల్లలతో సమానంగా, చెప్పాలంటే కాస్త ఎక్కువగా చూసుకుంటోంది.

రాజారావుకి 'జిమ్మీ' అంటే ఇష్టమే. ఎంత చూసినా చూడాలని పించేటంత ముద్దుగా, బొద్దుగా ఉంటుంది. అయితే, ఎంత యిష్టమయినా ఒక కుక్క పిల్లని – నవమాసాలు మోసి, కని, పెంచినపిల్లలా వనజమ్మ

చూసుకోవడం బాగా లేదనుకున్నాడేగాని పైకి అనలేదు. 'నీ మూడో సంతానం' అని మాత్రం రిఫర్ చేసేవాడు సవ్వతాళకి.

"అవునులెండి. నా మూడో సంతానం జిమ్మీ. మీ మూడో సంతానం ఆ గాటి గుంట" అనేది వనజమ్మ.

అదిగో, ఆ రకం ప్రవర్తనే నచ్చదు రాజారావుకి.

గాటీ విషయంలో వనజమ్మ చాలా దారుణంగా ప్రవర్తిస్తోందని బాధ పడుతుంటాడు రాజారావు. దానిపేరెట్టి ఎప్పుడూ పిలిచినట్టు తను వినలేదు. కర్రిముండనో, గుంటపాపనో పిలుస్తుంది. లేకుంటే ఏమే, ఒసే అంటుంది.

చివరికి జిమ్మీకి గూడా గాటీ అంటే ఏవగింపే, చిన్నచూపే! 'జిమ్మీ' అని పిలిస్తేరాదు. భయంగా వెనక్కి వెళ్ళిపోతుంది. గాటీయే రెండడుగులు ముందుకు వేస్తే భౌ భౌ మని పారిపోతుంది.

ఓసారి జిమ్మీకి గజ్జి దియిల్దేరింది. అది మాట మాటకి గోక్కోవడం చేత వెంట్రుకలు రాలిపోయి బోడిగా, అసహ్యంగా తయారవబోతుంటే వనజమ్మ ఏమాత్రం ఉపేక్షించకుండా - నిర్లక్ష్యం చూపకుండా నెలల తరబడి వైద్యం చేయించి బోల్డు డబ్బు తగలేసింది- కుక్క కోసం!

కాని గాటీకి అగ్గి జ్వరంవస్తే తనకిపట్టనట్టు ఊరుకుంది. రాజారావు ఆఫీసునుంచి వచ్చి విషయం తెల్సుకొని - రెండు జ్వరం మాత్రలు కొని తీసుకొచ్చాడు. ఆ రోజు మాత్రం వనజమ్మకి చీవాట్లు పెట్టాడు.

'గాటీ విషయంలో జాలిపడ్డం తప్పించి నేను ఏమీ చేయలేకపోతున్నానా?' - అని ప్రశ్నించుకున్నాడు రాజారావు.

గాటీ నిజానికి తన పిల్లలు నాని, బేబీల్లా కళకళ్ళాడాల్సిన పిల్ల ఆఖరికి యీ విధంగా తనింట్లో పనిపిల్లగా తయారయింది. అసలు ఆపిల్లను

తీసుకురావడం ఇంట్లో నౌకరీ చేయించుకోడానికి కాదు. ఆ పని తనిచ్చే దేమిటి? ఎవరైనా ఇస్తారు. తనకేం లోటులేదు. అలాంటి పదిమంది పిల్లలని పోషించగల కెపాసిటీ తనకుంది. అంచేత ఆ పిల్లపైన జాలిపడి, తన పిల్లలతో కలిసి వుంటుందని — అంతేగాక తన భార్యకి ఏదో కొంత సాయంగా కూడా వుంటుందని అనుకోక పోలేదుగాని- ఈ పిల్లస్థితి మరీ ఇంత అధ్వాన్నంగా, నీచంగా అయిపోతుందనుకోలేదు రాజారావు.

రాజారావు సింహాల క్లబ్ మెంబరు. ఆ క్లబ్బు పేద విద్యార్థులకి స్కాలర్‌షిప్పులూ, అగ్ని, వరద బాధితులలాంటి వారికి సహాయ కార్యక్రమాలు, అనాథలను ఆదరించడం వంటి పేదజనోద్ధరణ కార్యక్రమాలు వీలున్నప్పుడల్లా చేస్తుంది. చేస్తుందంటే అది వారి లక్ష్యంకాదు - హాబీ, పబ్లిసిటీ స్టేటస్, అహం!

గాటీ సమస్యను క్లబ్ తీసుకుంది. ఆమె బాధలను తమ బాధలుగా స్వీకరించింది.

క్లబ్బులో గాటీ హృదయవిదారక గాథ చెప్పగా 'సింహాలు' విని చలించి పోయేరు.

గాటీకి మొన్న మొన్నటి వరకూ తల్లిదండ్రులున్నారు. తండ్రి తమిళుడు. తల్లి బెంగాలి. గాటీ తండ్రి తెలుగు దేశంలో ఒక కంపెనీకి యూనియన్ లీడరు. మానేజిమెంటుకి చెంచాగా, కార్మికులకి దగాకోరుగా ప్రవర్తించే నాయకుడు లాంటివాడుకాడు. నిజాయితీ మనిషి. నిప్పులాంటి మనిషి. కొన్ని సమస్యలపై అన్నిరకాల కన్సిలియేషన్లు ఫెయిలయినాక సమ్మె ఆయుధం చేతపట్టేడు. మేనేజిమెంటు బెదిరించింది. నిజాయితీకి, చిత్తశుద్ధికి, ఐక్యతకి దానితల్లో జేజమ్మయినా జంకుతుంది. యాజమాన్యం అన్నిరకాల దుష్ప్రచారం లీడరుపై చేసింది. తెలుగు కార్మికులకు అరవ లీడరేమిటంది?

కార్మికులంతా ఒకటి. ఒకే కులం, ఒకే మతం. ఒకే భాష. ప్రపంచ కార్మికులంతా ఎప్పుడూ ఒకటే ఒకటే ఒకటే! – అని కలిసికట్టుగా నిలబడ్డారు. కార్మిక ఐక్యతకి మానేజిమెంటు అదిరిపోయి – చట్టవ్యతిరేకంగా నడుస్తున్నాడనీ, బెదిరిస్తున్నాడని చెప్పి గాటీ తండ్రిని అరెస్టు చేయించింది.

అతణ్ణి పోలీసుస్టేషను కష్టడిలో వుంచేరు. కార్మికులు కోపోద్రిక్తులయి స్టేషనుమిదికి దాడిచేశారు. ఆ జనాన్నిచూసి పోలీసులు బెదిరేరు. నాయకుని లాకప్‌నుంచి విడిపించుకొని, సభచేసి, ఊరేగిస్తుంటే — పోలీసులు పరాజయం అంగీకరించడం ఇష్టంలేక కాల్పులు జరిపేరు. అక్కడి కక్కడే నల్గురైదుగురు కార్మికులతోబాటు గాటీ తండ్రి దుర్మరణం చెందేడు.

అప్పుడే జబ్బుతో ఆస్పత్రిలోవున్న గాటీ తల్లి ఆ దుర్వార్తకి గుండాగి చనిపోయింది. గాటీ దిక్కుమాలినదైంది. అక్కడ డాక్టరుగారు జాలితలచి, గాటీని పదిరోజులు తనదగ్గరుంచుకొని – తర్వాత పెద్ద భారంగా తలచి – తనూ సింహాల క్లబ్బు మెంబరేగాబట్టి క్లబ్బుకి అనాథ కింద అప్పజెప్పేడు.

క్లబ్బు సమావేశంలో గాటీని చూసి సింహాలన్నీ జాలిచెందేయి. క్లబ్బు ఆ పదేళ్ళ పాపకి తిండీ, వసతి కల్పించడానికి చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న పనిగా తలచింది. బీదలకోసం ఈ ఏడాదికి గ్రాంటు చేసిన మొత్తం అప్పుడే పేదలకి ఖర్చయిపోయినట్టు లెక్కలు చెబుతున్నాయి. ఆ విధంగా పాపని క్లబ్ భరించే స్థితిలో లేదని తేలింది. ఏదైనా అనాథ శరణాలయానికి రికమెండ్ చేసి పంపించేద్దామనుకున్నారు

అయితే —

'సింహం' రాజారావు తోటి సింహాలని ఆశ్చర్యపరుస్తూ లేచి నిలబడ్డాడు. గాటీ పోషణ బాధ్యత తనే పూర్తిగా స్వీకరిస్తానని అనౌన్సు చేశాడు. గాటీకయ్యే ఖర్చు – చదువుకీ, తిండికీ, నీడకీ, పెళ్ళికీ సమస్తానికీ తనే భరిస్తానని, ఆ కార్మిక నాయకుని కూతుర్ని తన కూతురుగానే భావిస్తానని చప్పట్ల మధ్య తెలియజేశాడు.

మరుచటిరోజు పేపర్లో 'సింహం' రాజారావు ధర్మగుణం, గొప్ప

తనం కీర్తించబడ్డాయి. ఆ పేపరు కటింగ్సు ఇప్పటికీ రాజారావు దగ్గర భద్రంగా వున్నాయి.

ఆ విధంగా పెద్దల్లో చెప్పినవి, పేపర్లో పడినవి – అక్షరాలా అమలు జరపలేక పోతున్నందుకు రాజారావుకి బాధగా వుంది. 'ఇది ఇంత క్లిష్టమైన సమస్యని తెలిస్తే – కీర్తి సంగతికేంగాని – ఆ బాధ్యతను స్వీకరించి వుండేవాణ్నికాదు' – అనుకున్నాడు రాజారావు.

గాటీకి చదువుకోవాలని వుంది. తనకూ చదివించాలనే వుంది. కాని వనజమ్మ అందుకు ఒప్పుకోలేదు. 'ఇంట్లో పనెవరు చేస్తారు? బడాయి గాని చదూకోవాలంటే బళ్లోకే వెళ్ళాలేంటి? ఇక్కడే చదూకోవచ్చుగా' అంది.

ఆమె అన్నది పాయింటే అనిపించి. ఇంటిదగ్గరే చదివే ఏర్పాట్లు చేశాడు. ప్రయివేటు మాస్టారుని పెట్టేడు. అయితే అది గాటీకి మూడురోజుల ముచ్చటే అయింది. ప్రయివేటు మాస్టారుని మానిపించేసి, పుస్తకాలు పట్టుకున్నప్పుడే ప్రత్యేకంగా ఆపని ఈపని చెప్పడం ప్రారంభించింది వనజమ్మ. ఆ సంగతి గ్రహించి కసిగా, దుఃఖంగా పుస్తకాలు అసలు ముట్టుకోవడమే మానేసింది గాటీ. రాజారావు జరుగుతున్నది గమనించే, గమనించనట్టు వూరుకున్నాడు—పెళ్ళాం నోటికి జడిసి.

*           *           *           *

సరిగ్గా ఈ రోజుకి—

గాటీని తను ఇంటికి తీసుకొచ్చి ఏడాదయింది అనుకున్నాడు రాజారావు.

ఏడాది పొడుగున గాటీకి తను సమకూర్చిందేమిటి?

భార్యచేత హింస. ఇంట్లో గొడ్డుచాకిరీ. ఎంగిలి మెతుకులు. చింకి చాప —అనుకోవడం కష్టమనిపించింది రాజారావుకి.

బట్టలు కూడా తనేం కుట్టించలేదు. గాటీ తనతో తెచ్చుకున్నది మూడు గౌనులే. గౌనులన్నీ చిరిగిపోయేయన్నది తను గమనించేడు.

లాభంలేదు ...ఈరోజునుంచీ – ఆరోజు క్లబ్బులో అన్నవి కొంతలో కొంతైనా అమలో పెట్టాలి. ఈరోజు డ్యూటీనుంచి వచ్చి

నప్పుడు ఒక గౌను కొనితేవాలి. భార్యకి నచ్చజెప్పి ఎలాగైనా గాటీ మళ్ళీ చదువుకునే ఏర్పాట్లు చేయాలి.

గాటీ తనని ఇంతవరకూ ఫలానాది కావాలని అడగలేదు. ఏ పని చెబితే ఆ పని చేస్తుంది. ఎక్కడుండమంటే అక్కడుంటుంది. భార్య తిడుతున్నా.... అప్పుడప్పుడు చేయి విసురుతున్నా కిక్కురుమనని గాటీ తత్వం తనకి నచ్చింది. కొట్టడం తప్పని భార్యని మందలించేడు కూడా. ఇంటిపనులు చక్కగా చేస్తుంది అల్లరిపిల్లలిద్దరినీ ఎంచక్కా ఆడిస్తుంది. గాటీ తనకి నచ్చింది.

ఈరోజునుంచి గాటీకి మంచి బట్టలు, మంచి తిండి ...చదువు ఎలాగైనా సమకూర్చాలని ఒక నిశ్చయానికొచ్చి డ్యూటీకి స్కూటర్ ఎక్కేడు రాజారావు. తన మనసు ఇపుడు తృప్తిగా వుంది.

పిల్లలిద్దరూ కాన్వెంట్‌కి వెళ్ళిపోయేరు.

మధ్యాహ్నం భోజనం చేశాక నిద్రపోయే అలవాటుంది వనజమ్మకి అదొకపని తనకి.

పడుకుంది వనజమ్మ.

ఇక ఇంట్లోవున్న ప్రాణులు గాటీ, జిమ్మీ.

జిమ్మీ ఇంట్లో అటూ ఇటూ తారాడి ఛెంగున వనజమ్మ పక్కమీదికి గిరి, ఆమె ఎపక్కలో వెచ్చగా పడుకుంది.

గాటీ తన గౌనులు బాగా మాసిపోవడంతో బాత్‌రూంలో గౌనులు ఉతుక్కుంది, వంటిమీదున్న గౌను కూడా తీసేసి ఉతుక్కుంది. గాటీ వంటిమీద చిన్న వెడ్డీ మాత్రమే వుంది.

డాబాపై ఎండలో పిట్టగోడపై తన మూడు గౌనులూ ఆరేసి — కిందకివచ్చి అంట్లుతోమింది. వంటగది శుభ్రంచేసింది. ఇల్లంతా మరోసారి తుడిచింది. చాటలో బియ్యంవేసుకొని రాళ్ళు ఏరడం పూర్తిచేసింది.

ఈపాటికి ఆరవేసిన గౌనులు ఎండిపోయే వుంటాయని భావించి డాబామీదికి వెళ్ళింది గాటీ.

వెళ్తే ఇంకేముంది?

గౌనులు పిట్టగోడమీదలేవు !

ముక్కలు, ముక్కలుగా, పీలిక పీలికలుగా, చిందర వందరగా డాబా అంతా పడివున్నాయి. ఒక ముక్కను పట్టుకొని ఇంకా చిత్రహింస చేస్తోంది జిమ్మీ!

అకస్మాత్తుగా వచ్చిన గాటీని చూసి గతుక్కుమంది జిమ్మీ. వీర విహారాన్ని చాలించి, నోట్లోని గౌనుపీలికల్ని వదిలేసింది.

గాటీమాత్రం జిమ్మీని వదల్లేదు.

గాటీలో ఇంతకాలంనుంచీ అణిగి మణిగివున్న కసి, కోపం, దుఃఖం పెల్లుబికేయి. పళ్ళు పటపట లాడేయి. కళ్ళు చండ్ర నిప్పులయేయి. వళ్ళు వజవజ వణకసాగింది.

గాటీ భీకరాకారం చూసి జిమ్మీ అడుగులు వెనక్కివేసి 'భౌభౌ' మనే బదులూ 'కుయ్ కుయ్' మంది భయంతో.

గాటీ జిమ్మీపై పులిలాపడి, దాని వెనక రెండుకాళ్ళను పట్టుకొని, పిట్టగోడకేసి బాదుతుంటే - జిమ్మీ 'కుయ్యో మొర్రో' అని ఏడుస్తున్న అరుపులకి వనజమ్మ నిద్రమత్తు వదిలేసింది. మంచం భారంగాదిగి, ఎంతో కష్టంగా, గబగబా తన కాయాన్ని మెట్లెక్కించి డాబా చేరుకుంది.

సరిగ్గా రాజారావు కూడా అప్పుడే వచ్చాడు.

అతని చేతిలో కొత్తగౌనువుంది - అది గాటీ కోసం కొనితెచ్చింది. డాబాపై దబదబ చప్పుడు విని గబగబా పైకి వెళ్ళేడు.

గాటీని తన భార్య బాదుతోంది. జుట్టుపీకి, గుద్దులు గుద్ది ___ కిందపడిపోయినదాన్ని తన్ని - మళ్ళీ జుట్టుపట్టుకు లేపి బాదుతోన్న భార్యని ఆపడం రాజారావు శక్యం కాలేదు.

అమ్మవారు పూనినట్టున్న వనజమ్మ వగరుస్తూ - గాటీ చేసిన ఘాతుకాన్ని తెలియజేసింది భర్తకి - ఒక పక్క గాటీని బాదుతూనే.

"నా బాబు, నా ప్రాణం జిమ్మీని పొట్టబెట్టుకోడానికా ఈ రాక్షసి ముండని ఇంటికి తెచ్చిపడేశావ్!" అంటూ రాజారావుని తిడుతూ, ఏడుస్తూ - గాటీని కొడుతూనేవుంది.

రాజారావు ఆ మూల పడివున్న జిమ్మీదగ్గరకెళ్ళి చూసేడు. ప్రాణంలేదు!

ఇంతలో ___

"కయ్" మని గావుకేక.

తలతిప్పి చూసేడు.

"చచ్చిపోయాను దేవుడోయ్" అని గెంతుతూ రంకెలు వేస్తోంది వనజమ్మ. మొసలినోటికి కాలుచిక్కిపోయిన ఏనుగులా గిజగిజ లాడుతోంది.

వనజమ్మ ఎడమకాలు పిక్క గాటీ పళ్ళమధ్య ఇరుక్కుపోయింది. ఆ బాధ భరించలేక నేలకూలిన ఏనుగులా పడిపోయింది. లబోదిబో మంటోంది.

రాజారావుకి తనభార్యని రక్షించుకోడానికి చాలా శ్రమపడాల్సి వచ్చింది. ఎంతకీ వదిలిందికాదు గాటీ.

రాజారావు గాటీని జుట్టుపట్టుకు తోసేసి - తను గాటీకి తెచ్చిన గౌనుని పర్ పర్ మని చించి వనజమ్మ గాయానికి కట్టుకట్టేడు.

కట్టుకట్టిన గౌనంతా రక్తం.

గాటీ పళ్ళనిండా రక్తం.

చిన్నచెడ్డీ నల్లని వంటిపై తట్టు అస్తవ్యస్తంగా. చిందరవందరగా జుట్టు.

కలకత్తా కాళిలావుంది గాటీ.

ఇరవై నాలుగ్గంటలూ గొడ్డుచాకిరీచేస్తూ, ఎంతతిట్టినా, ఎంతకొట్టినా కిమ్మనకుండా పడివుంటే గాటీ తత్వాన్ని మెచ్చుకోగల్గేదేగాని— ఎదురు తిరిగి తిరగబడ్డాన్ని సహించలేకపోయేడు రాజారావు.

చేయి బయిటికి చూపిస్తూ 'గెటౌట్' అని కింద్రుకొని అరిచేడు. అరిచేటప్పుడు అతని కంఠం వణికింది.

గాటీ వెంటనే కదల్లేదు. నెమ్మదిగా, నెమ్మది నెమ్మదిగా అడుగులు వేస్తూ రాజారావుకేసి వస్తుంటే - గాటీ కళ్ళల్లో ఎరుపు, నోరంతా రక్తం చూసి జడిసి అడుగు వెనక్కి వేశాడు రాజారావు.

గాటీ రాజారావు దగ్గరకివచ్చి 'థూ' అని రాజారావు వంక కాండ్రించి తుపుక్కున ఉమ్మింది. ఉమ్మేసి, విసురుగా వెనుతిరిగి — గబగబా మెట్లుదిగి—గేటుదాటి—రోడ్డెక్కి కాలుసత్తువ కొలదిపరిగెట్టింది.

(సమాప్తం)